# అలక

పిల్లకి బారసాల బలవంతాన్ని జరిపించి కమలతో సహా వచ్చేశాడు చంద్రం. అది సవ్యంగా జరిగిపోతే ఏ బాధా లేకపోనుగానీ, అందరూ నవ్వులాటకింద కట్టడంవల్ల వచ్చింది.

పిల్ల పుట్టిందగ్గర్నుంచి వెంటనే బారసాల చెయ్యమని ఎన్నివిధాల చెప్పినా పదకొండోరోజున కాదు ఇరవైఒకటోరోజున కాదు నెలకొకదినం తక్కువ చేసికూడా మావగారు చేశారుకాదు. సరికదా సముజాయిషీ అయినా ఇవ్వలేదు. అందుచేతనే చంద్రం ఏం ఆలోచించుకున్నాడోగాని మరోవిధాన్నయితే లాభం లేదని మావగారూ, అత్తగారూ ఏదో వూరు వెళ్ళడం, పెళ్ళాం ఒక్కర్తీ వుండడంచూసి ఒక మంచిరోజున వెళ్ళి అప్పటికప్పుడు పురోహితుణ్ని పిలిపించి ముహూర్తం పెట్టించి, బాజా భజంత్రీలు పిలిపించి తంతు యధావిధిగా జరిపించి వెంటనే కమలని ఇంటికి తీసుకు వచ్చేశాడు. అందరూ ముక్కులమీద వ్రేళ్ళు వేసుకొని బుగ్గలు పొడుచుకున్నా ఖాతరు చెయ్యలేదు.

తను చేసిన యీ పని అందరికీ విడ్డూరం అయినా తనకి అది తగినపని అని తోచింది. ఈ మావగారితో ఎంత పొత్తుగా వుందామని అనుకున్నా ప్రతి విషయంలోనూ ఏదో ఒక దగ్గిర తనకి ఇష్టం లేనటువంటిది చేస్తూనేవుంటాడు. అది అతడు బుద్ధిపూర్వకంగానే చేస్తున్నాడా? అని అనిపించి చంద్రానికి కోపం వస్తుంది. ఈ పని మంచిదే అని తనకి తోచిచేసినా మనసు మాత్రం మాటిమాటికీ తర్కిస్తూ కొట్టుకొంటోంది.

అందుగురించి ఆలోచించక తప్పకండాపుంది. ఇంత ఇది అయినా కమల మాత్రం కించిత్తూ కోపంగాని అయిష్టతగాని కనపర్చలేదు. ఎప్పటిలాగే వుంది. ఇంటికి వచ్చేసినా ఈ ఆలోచనే పట్టుకుంది. పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు ఆ సమయంలో—

"పిల్లని ఎత్తుకుని అలా కాస్త ఆడించండి పని తెమలడంలేదు" అంటూ గౌరిని చంద్రం చేతుల్లో పెట్టింది కమల.— చంద్రం తెల్లబోయాడు. అప్పటికప్పుడే మంచిబట్టలు వేసుగొని ఆఫీసుకు పోవడానికి సిద్ధపడుతున్నాడు. కాని అదేమీ గమనించకండానే కమల గౌరిని అతడి చేతుల్లోవుంచి వెళ్ళిపోతూంది.

"బావుంది ఆఫీసుకి వేళ అయిపోతూంది. నువ్వే తీసుకు ఆడించు తరవాత పని చూసుకుందూగాని" అని మామ్మూలుగా అనేసి పిల్లని తిరిగి ఇచ్చేయబోయాడు.

ఆ జవాబు విని వెళ్ళిపోతున్నదల్లా ఇటు తిరిగి కిసుక్కున నవ్వింది. చంద్రంవయిపు అదోలా చూసింది.

ఆ చూపులో అయిదేళ్ళనాటి వేడుకలన్నీ కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నాయి. ఆ నవ్వులో ఆ నాటి అపురూపపు మాటలన్నీ బొటబొటరాలాయి. అపుడామె నిలబడ్డ వైఖరి... శోభనం గదిలో తలుపు దగ్గర నిలబడివున్నపుడు, చంద్రం దొంగతనం లేకండా తొలిసారి ధైర్యంగా చూసినట్టేవుంది. అలక పాన్పుమీద ఓరకంటితో చూసిన కమల ఇప్పుడు తిరిగి అలాగే కనిపిస్తూవుంది.

ఇలా కమలవైపు చూస్తూ వర్తమానం మరిచిపోయి వున్నాడు చంద్రం.

ఇంతలో వెచ్చవెచ్చగా చేతులకి, బట్టకిందా తగలగానే ప్రపంచంలో పడ్డాడు...

ఆ ఆనవాయితీ తీరగానే గౌరిని తీసుకుందికని కమల చేతులు జాపింది ఆ చేతులెందుకోగాని ... మొదటిసారి చంద్రం పందుక్కు

వాళ్ళింటికి వెళ్ళినపుడు ఎవరూ లేకుండా చూసి ఆమెచెయ్యి అందుకున్న ప్పుడులాగేజుకుతున్నాయి.

కమల గౌరిని తీసుకుంటున్నపుడు చంద్రానికి ఆమె చేతులు తగిలేయి.

అప్పుడతని ఒళ్ళు జల్లుమన్నదంటే ఆశ్చర్యం ఏముంది?

పరవాణ్ణం మొదటిమారు ఇద్దరూ కలిసి తిన్నపుడూ, గదిలో గంధం రాసినపుడూ, తలంబ్రాలు పోసినపుడూ, చిటికినవ్రేలు పట్టుకొని అగ్నిహోత్రం చుట్టూ తిరిగినపుడూ, మంగళసూత్రం కట్టేప్పుడు కంఠం చుట్టూ చేయి తగిలినపుడూ, సూత్రం కట్టడానికి బరువైన జడని మీదకు ఎత్తినపుడు, బిందెలో గొలుసు కోసం పందెంవేసి పోట్లాడుతూన్నపుడూ వున్నట్టే చంద్రానికి ఇప్పుడూ వుంది.

అయితే గొలుసు పందెంలో అన్యాయంగా అతని చెయ్యి గిల్లి గొలుసు లాగేసుకుంది కమల. తేలు కుట్టిన దొంగలా చంద్రం నోరు మూసుగు వూరుకునేసరికి "అబ్బే పెళ్ళాంతో చాలలేకపోయాడు!" అని అందరూ గోలపెట్టి చిన్నబుచ్చారు. అయినా అప్పుడు కమల తీసుకుంటేనే చంద్రానికి సరదాగా వుంది. అఁదేవిటో! అందికే పెళ్ళాం బెల్లమంటారు!

కమల గౌరిని తీసుగొని వారిద్దరికీ మధ్యనున్న ఉయ్యాల్లో పడుకో బెట్టింది. చంద్రం వేపూ గౌరివేపూ చూస్తూ కమల—

"నాకు నవ్వొస్తూంది" అంది.

"ఎందుకూ!" అన్నాడు చంద్రం.

"చెప్పుకోండి!"

"నా మీద ఉచ్చబోసిందనా! ఆనందం!"

"ఓ మా గొప్ప! టీ తాగుతూ ఒలకబోసుకున్నపుడూ, బొమ్మలు వేసేటప్పుడు రంగు బ్రష్‌లు చొక్కాతోనే తుడిచేసుకున్నపుడూ తేడు కామోసు ఇప్పుడే వచ్చింది!"

"అవును. ఆ సమయంలో అలాగేవుంటుంది. మరి మంచి పెచెస్ పెడుతూంటే వేళకి గుడ్డ దొరకనప్పుడు ఏం చేయడం?"

"ఫోనీలెండి!" అందుకోసం కాదు!"

"మరి దేనికి!"

"జ్ఞాపకం లేదూ! తెచ్చుకోండి?"

"ఎక్కడ నుండి తెచ్చుకోవడం?"

"మీ పెళ్ళి నుండి!"

"నా పెళ్ళినుంచా! నీ పెళ్ళినుంచా? మన పెళ్ళినుంచా!"

"ఎక్కడ నుండి అయినా ఒకటే!"

అని ఆమె అన్న తక్షణం ఆమెని మంచం మీద కూర్చోబెట్టేడు చంద్రం.

"ఊవుంది ఇదేఁవిటీ వికారం? వేళా పాళా..."

"ఏం 'నాగవల్లి'... తెచ్చుకున్నాను జ్ఞాపకం..."

"అయితే..."

"అప్పుడూ ఇలాగే కూర్చున్నాం...ఇలాగే ఉయ్యాల కట్టేరు... కాని... అయిన మార్పు— చందనపు బొమ్మకి బదులు— గౌరి — వసంతానికి బదులు— వుచ్చ..."

ఇలా చంద్రం చెప్పగా కమల మారిపోయింది. ఏదో ముగ్ధత్వం ఆవరించింది. ముఖం ఎర్రగా చేసుగొని దూరంగా జరిగి వయ్యారంగా సారి పెళ్ళికూతురిలా తల వంచుకొని వింటూంది!

కొంతసేపు ఎవ్వరూ మాటాడలేదు, ఆ మధురస్మృతులు నెమరు వేసుకుంటూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ అదోలోకంలోకి పోయి వున్నారు. అంతలో గౌరి ఏడుపు మొదలెట్టేసరికి ఇద్దరూ మేలుకున్నారు.

"అదుగో మీ నాన్న! ఎత్తుగోమని అడుగు" అంది కమల.

"నా పేరు చెబితేనేగాని దానికేం తెలుస్తుంది" అన్నాడు చంద్రం. "నీ పేరు బాగా తెలుసు నువ్వే తీసుకో!" అని కూడా అన్నాడు.

"నా పేరు మీరు చెప్పండి దానికింకా తెలీదు!" అంది.

"నువ్వు మొదట చెప్పు!"

"మీరు మొదట చెప్పండి!"

—అమ్మలక్కలెవ్వరూ అక్కడ లేకపోవడంవల్ల ఆ ముచ్చట అట్టేసాగలేదు. ఇంతలో గౌరి ఏడుపు ఎక్కువ అయింది.

"కాస్సేపు ఆడిద్దురూ" అని ఇదంతా మరిచేపోయి అనుకోకండా అనేసింది. చంద్రానికి ఆశ్చర్యంవేసి.

"ఆఫీసుకు పోవాలి నువ్వే ఆడించు" అనేసేడు...

...మళ్ళీ కమల ఫక్కున నవ్వింది...

...చంద్రం కూడా ఫక్కున నవ్వేడు...

* * * *

లాంఛనాలూ, పిలుపులూ, మర్యాదలూ, తూ చ. తప్పకుండా జరిపించి పిలవగా పిలవగా మురిపించి మురిపించి పండగనాటికి వచ్చాడు, అల్లుడు!... అల్లుడెంత చికాకుకలిగిస్తున్నా 'గౌరి'ని చూసేసరికి అవన్నీ మరిచిపోతూవుంటారు కమలా చంద్ర. కన్నపిల్లని ఏడాదికోసారయినా తీసుకవచ్చి ముద్దూ ముచ్చటా తీర్చుగోకపోతే ఉండబడుతుందా? ఎవరి కయినా? అందుకనే అల్లుళ్ళు ఎన్ని అలకలు అలిగినా బతిమాలుకొని అన్నిటికీ పడి తీసుకువస్తూంటారు. అల్లుడొచ్చి శాంతంగా వెళ్ళేవరకూ మనశ్శాంతే వుండదు కొందరికి.

మొత్తంమీద వేడుకలన్నీ అయినాక కానుకలన్నీ ఇచ్చాక అల్లుడు వెళ్ళిపోయాడు. గౌరి మాత్రం వుంది. అప్పటికి తిరుపతి కొండ ఎక్కి దిగినట్టయింది చంద్రానికి!

ఆ నాలుగు రోజులూ కమల పనుల్లోనే మునిగిపోయివుంది. చంద్రంతో మాటాడానికైనా తీరిక అయిందికాదు. ఒకసారి మధ్యలో తనే చొరవ చేసుకోబోతే—

"మతిపోతూందా ఏమిటి? మరీ చిన్నతనం చేష్టలూ మీరూను! ఎదురుగుండా అమ్మాయీ, అల్లుడూ వుంటూంటేను" అని కసిరేసింది!

అమ్మాయీ అల్లుడూ ఎవరూ లేని సమయం కోసం కనిపెడుతూ వుండడం, ఎవరూ లేరని అప్పుడపుడు బెదురుతూ కలుస్తూ పోతుండడం గమనిస్తున్న చం ద్రానికి తన చిన్నతనం, తనూ కమలావాళ్ళ యింటికి యిలాగే పండుగలకి వెళ్ళినపుడు గడిపిన హాయి అయిన రోజులూ ఆ అనుభవాలూ అన్నీ జ్ఞాపకానికి తెచ్చుకుని ఆనందపడేవాడు.

మరి ఒకటి రెండురోజులు అల్లుడు వెళ్ళిన తర్వాత పండుగ కబుర్లతో గడిపేరు.

ఆరోజు ఆఫీసులో వుండగా తనపేర వచ్చిన పార్సిలును ఆశ్చర్యంతో విప్పిచూడగా 'పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసేనా?' అనిఅనుమానించవలసి వచ్చింది

అందులోవున్న వస్తువులు చూడగానే చంద్రానికి కోపం, ఆశ్చర్యం, ఉడుకుమోతుతనం, అన్నీ కూడుకొని వచ్చాయి. అందులో తను అల్లుడికిచ్చిన సూటుబట్ట, ఒక వుత్తరం వున్నది. ఆ ఉత్తరంలో...

"ఈ బట్టలు పొరపాటున నాకు తెలియకుండా వచ్చేసాయి, సర్దడంలో మీ అమ్మాయి పొరపాటు చేసివుంటుంది, ఇవి ఎవరివో తెలియక తిరిగి పంపేస్తున్నాను" అని వుంది.

అది చదివి ఏంచేయాలో తోచక విసుక్కున్నాడు. కమల చెప్పి ఇస్తుంది కదా అని తను అల్లునితో ఏం అనలేదు! అదీగాక అతగాడిని కూడా బజారుకు తీసుకువెళ్ళి కొన్నాడు. అటువంటప్పుడు ఎవరికోసం కొన్నట్టు? అతనికి కాకపోతే మరెవరికి ఆ సమయంలో కొంటాడు? బాగుంది వరస! ఇంకా మర్యాద చాలలేదా! ఇలాగయితే ఎవడితరం? అని అప్పటికి అనుకొని యింటికొచ్చి పార్సిలు కమల చేతికిస్తూ—

"నువ్వు ఈ బట్టలు అతనికే అని చెప్పలేదా?" అని అడిగాడు.

ఆ పార్సిలుచూసి చంద్రం అన్నమాటలు విని, ఆ ఉత్తరం చదివి జవాబు చెప్పడానికి బదులు కమల పకపక నవ్వడం ప్రారంభించింది.

అది చంద్రంకి ఏం అర్థంగాకపోగా చికాకు వేసింది.

"ఏమిటిది? నవ్వులాటెందుకు? అతగాడు ఏ ఉద్దేశ్యంతో తిరిగి పంపేశా ఏమయింది?" అనడిగాడు.

"ఏమయింది? మీరునేర్పిన విద్యయే అన్నట్టు...అతగాడు మీకు అల్లుడేగా. తక్కువేం..." అంది నవ్వుతూ మాటాడుతూ నవ్వుతూ... మాటాడుతూ.

"నవ్వయినా చెప్పు...చెప్పి అయినా నవ్వు"

"మరి పూర్తిగా నవ్వనీండి!"

"చాలు ఇంక చెప్పు!"

"తగిన పనే చేశాడు!"

"అంత వేళాకోళంగా వుంది! దీనితో వూరుకుంటాడా? నలుగురి తోనూ చెప్పడూ?"

"ఏం చెబితే! మీరూ అందరితోనీ చెప్పలేదూ?"

"ఏమని, ఎప్పుడు?"

"జ్ఞాపకం తెచ్చుకోండి!"

"ఎక్కడినుండి తెచ్చుకోవడం!"

"మీ అత్తవారింటిలో నుండి!"

—ఆ ముక్కతో చంద్రం స్థితి మారిపోయింది. అవును! ఆ సమయంలో ఆ ముక్కలంటున్న కమల సరిగ్గా అతని అత్తగారిలాగే అవుపించింది. అతని అత్తగారే అలా అడుగుతున్నట్టు వుంది.. ఆనాడు తను చేసినవన్నీ జ్ఞాపకానికి వచ్చాయి...అవకాశం వుంది కదా అని, వారి చెయ్యికిందా తనచెయ్యి మీదా అని...వారి అనువు పరిస్థితి కనిబెట్టి ఆడపిల్లని ఇచ్చుకున్నాక తనేంచేసినా చెల్లుతుందనే గర్వంతో నీ భార్యని వెనక వేసుకొని ప్రతిదానికి ఒడ్డుతూ, ఒక ఆయుధంలా ఉపయోగించి ఏమయినా అంటే— తను చేయగలిగింది చేసినా ప్రస్తుతం చెల్లుతున్నది

పిల్లని పుట్టినింటికి వేరుచెయ్యడం ఒక్కటే కాబట్టి, పంపను అంటూ బెదిరించి భయపెట్టడమూ, అయినదానికీ కానిదానికీ సందర్భ శూన్యంగా పేచీలు పెడుతూండడమూ, శక్తికొలది పంచిల చాపు పెడితే తాహతుకి తక్కువ అని మాటు బలవంతాన్ని తీసుకోడం, మరోమారు సైకిలు యిచ్చినట్టయితే గాని తీసుకు వెళ్ళడానికి వీలు లేదనడం, ఇంకోసారి అర్జంటుగా అయిదువందలు కావాలని తీసుకుని ఎగనామం పెట్టడం, ఒకసారి మాటమీద మాటరాగా, పిల్లని తను పంపకపోయినా, చీరలు కొని పంపుతే తిరిగి పార్శిలుచేసి పంపెయ్యడం, ప్రతిసారి వెళ్ళినపుడూ 'ఫలానా యింత' అని అచ్చివున్నట్టు, దాచిపెట్టినట్టు అడిగి, గుంజి, డబ్బు తీసుకుంటూండడం... ఈ విధంగా చింతించే మనసుల్ని విచారించకుండా క్షోభపెట్టిన రోజులు జ్ఞాపకానికి వచ్చి చంద్రం అలా వుండిపోగా...

కమల చేతిలోంచి పార్సిలు తీసుకుంటున్నపుడు తెలివి వచ్చింది.

"అవును తగినపనే చేశాడు" అన్నాడు.

అది విని కమల పూరంత నవ్వింది.

"ఏం మీరెంచేత చెప్పలేదు!" అని అడిగింది.

"నువ్వు చెప్పేవనుకున్నా నువ్వు చెప్పలేదా?"

"అతను చూస్తుండగానే బెడ్డింగులో పెట్టేను వేరే చెప్పేదేముంది?"

చంద్రం కొంతవరకూ పశ్చాత్తాప పడ్డా అహం వదలలేదు,కోపం లోపల వుంది.

"అతనికిస్తామని తెలీదా! అంత ఇష్టం లేకపోతే ఇక్కడే వదిలేయరాదూ? మళ్ళీ ఈ డొంక తిరుగుడంతా ఎందుకు? వేరే బొట్టుపెట్టి చిత్తగించు అనిచెప్పాలా! ఒకడిని చిన్నబుచ్చితేగాని వేరొకడికి గౌరవం, ఆధిక్యతా రాదు, అక్కడికిగాని అతగాడి గౌరవం నిలబడదు కాబోలు?" అని గబగబా అనేసేడు.

"భూమి గుండ్రంగా వుందని చెప్పడానికి, తలనొప్పి అయినా తనదాకా వస్తేగాని తెలియదని చెప్పడానికిన్నీ ఇలా చేశాడు. అందుకే అన్నారు అత్తా ఒకింటి కోడలే అని. మీరివన్నీ ఆలోచించే అప్పుడు ఏడిపించారా?" అంది కమల.

"నువ్వయినా వుంచు నా మర్యాద! అసలు నువ్వు చెప్పి ఇవ్వక పోవడం నీది తప్పు!"

"బావుంది, ఏది వచ్చినా నామీద తోస్తారు! అమ్మాయితో చెప్పేను..."

అని కమల అంటూండగానే 'గౌరీ' అక్కడికి వచ్చి—

"బావుంది నాన్నా.నువ్వే చెప్పు! ఇచ్చేవారుమీరు, పుచ్చుకొనేవారు తను! మధ్య నేచెప్పడం ఏమిటి? నా పెత్తనం ఏమిటి? అలా అయితే ఈ సామానంతా తీసుకోమని చెబుతాను! తీసుకోనిస్తారా? అయినా అతనితో నువ్వు మాటాడవా? అమ్మ మాటాడదా? అతని సంగతి మీకు తెలుసు! అందుకే ఆయన తిగిగి తోలేశారు! యిందులో ఆయన తప్పేముంది?

అదిగాక నే చెప్పినంత మాత్రంలో తీసుకుంటే ఆ తర్వాత 'మేం చెప్పకుండా తీసుకుపోయాడు ఏదయినా ఇంతేగదా?' అని మీరంటే! అంచేతే ఎవరి జాగ్రత్తలో వారుండాలి!" అని గబగబా సమయం చూసు కొని తగినట్టు సమాధానం చెప్పేసింది.

అవన్నీ విని కమల ముఖం చంద్రం, చంద్రం మొఖం కమలా చూసుకొని వుండిపోయారు తప్పిస్తే జవాబు చెప్పలేక పోయారు.

కన్న కూతురయినా గౌరి ఆమె భర్తనే వెనకేసుకొచ్చి వాదించ డం చూసి ఆశ్చర్యపోయాడు. "ఈ అడవాళ్ళలో ఎంత మార్పువస్తుంది" అనుకున్నాడు.

"అలా అంటున్న అమ్మాయి గౌరిని చూస్తూంటే తన చిన్నప్పుడు తనది తప్పున్నా తన వయిపు వాదించిన కమలే గౌరిలో చంద్రానికి కనిపించింది. గౌరి వెళ్ళిపోయింది.

"చేసినతప్పులు దిద్దుకోండి" అంటూ మళ్ళీ ఒక్కలా నవ్వటం మొదలెట్టింది కమల. ఆ నవ్వు ఆగడంలేదు...

కాని చంద్రానికి మాత్రం ఏ కోశాన్నా తెచ్చుకుందామన్నా నవ్వు రాలేదు...

ఒకప్పుడు గౌరిని చేతికిస్తూ 'నాగవల్లి' అని నవ్వించిన కమలతో సహా చంద్రం కూడా నవ్వేడు...కాని...

ఇప్పుడు...'అల్లుని అలక' సమయం వచ్చినపుడు మాత్రం అలకతీర్చడం, అలిగినంత తేలిక కాదని అనుభవపూర్వకంగా తెలుసు కోవడంవల్ల కమల నవ్వినా, నవ్వించినా, చంద్రం నవ్వలేకపోయేడు...

—ఆంధ్రపత్రిక. 23-3-55